సాక్షి

అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



మహాశివరాత్రి ఉత్సవాలకు పాలతల ముస్తాబు

మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. - 8లో



జాగ్రత్తలు పాటిస్తే పాడిపశువుల వృద్ధి

రైతులు జాగ్రత్తలు పాటిస్తే పాడి పశువులు వృద్ధి చెందుతాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.90	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 150 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	670	670
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 250.02 కిలోలు

కల్యాణం.. కమనీయం

- వైభవం రాచరాయుడి కల్యాణోత్సవం
- స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

సాక్షి రాయచోటి/టౌన్ : రాచవీడు శ్రీ రాచరాయుడి (శ్రీ వీరభద్రస్వామి) కల్యాణ మహోత్సవం వేద మంత్రోచ్చాటనలు, మంగళ వాయిద్యాల మధ్య నేత్రపర్వంగా కొనసాగింది.సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులైన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణ ఘట్టాన్ని అర్చకులు, వేద పండితులు వేడుకగా నిర్వహిచారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం అనంతరం మరుసటిరోజే స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ పోలంరెడ్డి విజయ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరాథమిరెడ్డి, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా కల్యాణాన్ని నిర్వహించారు.



కల్యాణ మహోత్సవంలో వేదమంత్రాలు పఠిస్తున్న వేదపండితులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

- రాయచోటిలోని భద్రకాళీసమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకుని ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం వేద పండితులకు వాటిని అందించారు. తర్వాత స్వామి వారి కల్యాణాన్ని ఎమ్మెల్యే వీక్షించారు. కల్యాణఘట్టం ముగిసిన అనంతరం ఆలయ అభివృద్ధి విషయమై చైర్మన్ విజయ, వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిలతో చర్చించారు. మాడవీధులతోపాటు వసతి గదులు, ఇతర అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది.
- రాయచోటిలోని వీరభద్రస్వామి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. పట్టణ ప్రముఖులతోపాటు కర్ణాటక, ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని అక్షింతలు, ముత్యాల తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారికి సుమంగళి పూజ నిర్వహించారు. మహిళలకు గాజులు, పసుపు కొమ్ము తాడు, కుంకుమ అందజేశారు.
- వీరభద్రస్వామి కల్యాణాన్ని పలువురు ప్రముఖులు తిలకించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా సతీమణి స్నేహ, డీఆర్వో సత్యనారాయణ సతీమణి నాగ హరిప్రియ, డీఎస్పీ సతీమణి సుమలత, దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్,మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మైనార్టీ నాయకుడు బేపారి మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు



కలెక్టర్ సతీమణి స్నేహలతకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదిస్తున్న వేదపండితులు

సంస్కార హీనంగా లోకేష్ భాష

- తండ్రీ కొడుకులు అచ్చోసిన ఆంబోతుల్లా మాట్లాడుతున్నారు
- ముందు నువ్వెక్కడ పుట్టావో, ఎక్కడ పెరిగావో చెప్పు లోకేశ్
- మాకు సంస్కారం ఉంది.. లేదంటే మీకంటే ఎక్కువ బూతులు మాట్లాడగలం
- భరిస్తున్నాం కదా అని ఇష్టారీతిన మాట్లాడితే మూల్యం చెల్లించుకోవాల్సిందే
- అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కడప కార్పొరేషన్: నారా లోకేష్ మాట్లాడుతున్న భాష సంస్కార హీనంగా ఉందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ రాయలసీమలో పుట్టాడా అని లోకేష్ మాట్లాడాడని, వైఎస్ జగన్ జమ్మలమడుగులోని క్యాంప్‌బెల్ ఆసుపత్రిలో పుట్టారని, లోకేష్ ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో ఆయనకైనా తెలుసా అని ప్రశ్నించారు. రాయలసీయలో పుట్టిన మేము నీకంటే ఎక్కువ బూతులు మాట్లాడగలమని .. కానీ మాకు సంస్కారం ఉంది కాబట్టే మాట్లాడటం లేదన్నారు. ఊరిపైన వదిలేసిన అచ్చోసిన ఆంబోతుల్లాగా తండ్రి, కొడుకులు పచ్చి బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళా ప్రజా ప్రతినిధులను విచిత్రమైన పేర్లతో సంబోధిస్తూ సంస్కార హీనంగా మాట్లాడటం దారుణమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు తాను ఏం చేస్తాడో, పేదరికంపై ఎలా పోరాడుతారో చెప్పారని గుర్తు చేశారు. మీ పాదయాత్రలో మీ పార్టీ విధానం ఏమిటో, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో, మళ్లీ వస్తే ఏం చేస్తారో చెప్పకుండా తిట్లదండకం ఎందుకు చదువుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు , లోకేష్ వారి యాత్రలలో జనాలు లేరని నిరాశకు గురై ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. లోకేష్ తెలుగులో ప్రావీణ్యం లేక పచ్చి బూతులు మాట్లాడుతున్నాడన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్ దొంగచాటుగా ఎమ్మెల్సీ అయ్యాడని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల్లో చులకన చేయడానికే పదే పదే సైకో అని విమర్శిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా మీరు మేనిఫెస్టో దాచిపెట్టారని, వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోనే భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని 95 శాతం హామీలను అమలు చేసినందుకు సైకో అంటున్నారా ...అని ప్రశ్నించారు.

బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డిని వైఎస్ జగన్ ఎలా చూసుకున్నారో అందరికీ తెలుసని, వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడటం మానుకోవాలన్నారు. వైయస్ కుటుంబం మంచితనం ఎంచుకుంటే నారా కుటుంబం చెడును ఎంచుకుందని తెలిపారు.తండ్రి , కొడుకులకు రాయలసీమ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రాయలసీమ ప్రజలను అథఃపాతాళానికి తొక్కేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కర్నూలుకు హైకోర్టు వస్తుంటే ఆయన ఓర్వలేకపోతున్నారన్నారు. భరిస్తున్నామని ఇంకా మాట్లాడితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కె. కొండయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైద్య విద్యార్థినికి బంగారుపతకం

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీ చెరువుముందరపల్లికి చెందిన పులి నీరజ రెడ్డి బెంగళూరులోని శ్రీరామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్‌లైడ్ మెడికల్ సైన్సెస్‌లో వైద్య విద్య పీజీ చదువుతోంది. రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ, డయాలసిస్ టెక్నాలజీ విభాగం పరిశీలనలో ప్రతిభ కనబరిచింది.దీంతో విద్యార్థినికి బంగారుపతకలం లభించింది.గురువారం బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు కళాశాల యాజమాన్యం బంగారు పతకం అందజేసింది. ప్రస్తుత ఆహారపు అలవాట్లతో డయాబెటిక్‌తో చాలామంది బాధపడుతున్నారని, వారికి తన వంతు సేవ చేస్తానని నీరజరెడ్డి పేర్కొన్నారు.ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

టీటీడీ అన్నదాన కేంద్రానికి ముస్లిం వ్యాపారుల వితరణ



కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని కె.జె.కూరగాయల మండీ నిర్వాహకులు దాదాపీర్, ఖాజాపీర్‌లు టీటీడీ అన్నదాన కేంద్రానికి 50 టన్నుల కూరగాయలను పంపారు. వివిధ రకాల కూరగాయాలను ప్రత్యేక వాహనంలో తిరుమలకు తరలించారు. ఈ వాహనాన్ని ఆర్డీఓ మురళి ప్రారంభించారు. దాదాపీర్, ఖాజాపీర్‌లు టీటీడీకి ఉచితంగా కూరగాయలు పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుధాకర్, ఇమ్రోజ్, మస్తాన్ పాల్గొన్నారు.

ఆక్రమణలో 2,504 ఎకరాల భూములు

బి.కొత్తకోట: జిల్లాలో దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు చెందిన 2,504.3 ఎకరాల భూములు ఆక్రమణల్లో ఉన్నాయని ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 30 మండలాల పరిధిలోని 409 గ్రామాల్లో 8,281 ఎకరాల భూములు ఆలయాలకు ఉన్నట్లు చెప్పారు. వీటిలో 1,919 ఎకరాలు అర్చకుల ఆధీనంలో ఉండగా 2,684 ఎకరాలు ఖాళీగా ఉన్నాయన్నారు. గాలివీడులో అత్యధికంగా 598 ఎకరాలున్నాయని తెలిపారు. ఆక్రమణలోని భూములపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. బి.కొత్తకోటలోని దేవదాయ భూమిలో ఇసుక తరలింపుపై చర్యలు చేపట్టామని అన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇసుక తరలింపును పరిశీలించినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌కు నివేదిక పంపుతున్నట్లు పేర్కొన్నారు.

కమిటీలు వేసి ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పచెప్పండి

డీఈఓ రాఘవరెడ్డి



రాజంపేట టౌన్: విద్యార్థుల పర్యవేక్షణ బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పజెప్పాలని డీఈఓ రాఘవరెడ్డి హెచ్‌ఎంలను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం ఏడు మండలాలకు చెందిన ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడారు. బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి చరణ్‌తేజ ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులోపడి మృతి చెందడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి పాఠశాలలో కమిటీలు వేయాలన్నారు. అందులో ఉపాధ్యాయులు, చురుకైన, బాగా చదివే విద్యార్థులను భాగస్వామ్యులు చేయాలన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు ఉన్నాయన్నారు. విద్యార్థులు పాఠశాల సమయంలో బయటకు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎవరైనా బయటకు వెళ్లి వారికి ఏదైనా జరిగితే అందుకు కమిటీలోని ఉపాధ్యాయులను బాధ్యులను చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో స్థల విస్తీర్ణతను బట్టి మునగచెట్లను పెంచాలని డీఈఓ తెలిపారు. ఈకార్యక్రమంలో రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో లిప్‌ను తప్పని సరిగా అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతి పాఠశాలలో తప్పని సరిగా లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)ను అమలు చేయాలని అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల విద్యాశాఖ అధికారులు రాఘవరెడ్డి, దేవరాజులు పేర్కొన్నారు. గురువారం కడపలో వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలో లిప్‌లో శిక్షణ పొందిన ఎంఈఓలు, హెచ్‌ఎంలు, జిల్లా రీసోర్సుపర్సన్‌లకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్తు, నగరపాలక, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ యాజమాన్యాలలో 6 నుంచి 8 తరగతులకు తప్పని సరిగా లిప్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని ఆదేశించారు.బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కడప డివిజన్ డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, అన్నమయ్య డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, కడప ఎంఈఓ పాలెం నారాయణ పాల్గొన్నారు

అయ్యప్ప ఆలయానికి భూమి పూజ

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప నూతన ఆలయ నిర్మాణానికి గురువారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, మేడా రఘునాథరెడ్డి భూమి పూజ నిర్వహించారు. నగరంలో తొలి అయ్యప్ప ఆలయమైన దీనిని శబరిమలలోని ఆలయం లాగా నిర్మించేందుకు ఇటీవల బాల ఆలయం కూడా నిర్మించారు. కేరళ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన స్థపతి, శిల్పులు, నెల్లూరు నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేడా భాస్కర్‌రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డి, మేడా వెంకట శేషారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌బీ అహ్మద్‌బాష, పోతుల వెంకట్రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా రూ. 5 కోట్లతో నిర్మించనున్న ఈ ఆలయ నిర్మాణానికి తన వంతుగా ప్రముఖ కాంట్రాక్టర్ మేడా రఘునాథరెడ్డి రూ.1.5 కోట్లు విరాళం ప్రకటించారు.



ఆలయ నిర్మాణానికి పూజలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీదే హవా!

- వైఎస్సార్‌సీపీ ఖాతాలో జమ కానున్న మరో ఎమ్మెల్సీ
- ముగియనున్న బీటెక్ రవి పదవీకాలం
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్



సాక్షి ప్రతినిధి, కడప: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ హవా స్పష్టంగా కొనసాగుతోంది. ఒక్క మండలం మినహా మిగిలిన అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కడప కార్పొరేషన్‌తో సహా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వెరసి మరో ఎమ్మెల్సీ స్థానం ఆ పార్టీ ఖాతాలో జమ కానుంది. టీడీపీ నేత బీటెక్ రవి పదవీకాలం మార్చి 29న ముగియనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీ భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఆ మేరకు ఈనెల 13న పోలింగ్, 16న కౌంటింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈమారు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం అతి సునాయాసమని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నాటి తొలినాళ్లలోనే 2010లో జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలివిజయం దక్కించుకున్నారు. 2016లో కూడా వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ అధికారం అండ, ప్రత్యక్ష, పరోక్ష ప్రలోభాలు, భయభ్రాంతులకు గురిచేసి టీడీపీ కైవసం చేసుకుంది. స్వల్ప ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీ స్థానం చేజారింది. 2023 మార్చిలో ముచ్చటగా మూడవసారి నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి అడ్డుకట్ట వేసే అవకాశమే లేదని రాజకీయ విశ్లేషకులు విరిస్తున్నారు. కారణం ఒకే ఒక్క మండలం మాత్రమే టీడీపీ చేతుల్లో ఉండడమని వారు పేర్కొంటున్నారు.

అభ్యర్థి ఎంపికపై ఏకాభిప్రాయం..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీలో ఏకాభిప్రాయం వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 98శాతం సభ్యులు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో ఆ పార్టీ అభ్యర్థి ఎంపిక నల్లేరుపై నడకే. అయినా సరే అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థికి పట్టం కట్టడమే తరువాయిగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులున్నారు. అభ్యర్థి ఎంపికకు పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కాకపోతే రాజకీయ అనుభవం, అర్హత, సమీకరణలు పరిగణనలోకి తీసుకొని అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని పలువురు నాయకులు తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక సీనియర్ రాజకీయ అనుభవం ఉన్న నేత పేరును సూచించినట్లు సమాచారం. జిల్లా నేతల ఏకాభిప్రాయం మేరకు అధికారికంగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించాల్సి ఉంది. ఏదిఏమైనా ఈమారు అత్యంత సునాయాసంగా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

▸▸ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ గిరీషా



రాయచోటి : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమితులైన నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్, మెటీరియల్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్లకు సంబంధించి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, రిపోర్టింగ్ సెల్, డైలీ రిపోర్ట్స్, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలకు సంబంధించి నియమితులైన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఇందుకోసం పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌లో ఎన్నికల నిబంధనల మేరకు మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఎన్నికల నిర్వహణకు మాస్టర్ ట్రైనర్లతో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్‌కు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తొలి రోజు రెండు నామినేషన్లు



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రవీంద్రారెడ్డి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ కేతన్‌గార్గ్‌కు ఇస్తున్న రామచంద్రారెడ్డి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల తొలి అంకం నామినేషన్ ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 23 వరకు ఉంటుందన్నారు. 24న పరిశీలన నిర్వహిస్తారన్నారు. ఉపసంహరణకు 27 వరకూ అవకాశముంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల దాఖలు..

తొలి రోజున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎం.వి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ వేశారు. ఆర్‌ఓకు ఆయన చాంబర్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. ఒక సెట్ నామినేషన్ వేసిన ఇరువురు అభ్యర్థులు రెండో సెట్‌ను ఈనెల 22న దాఖలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడారు.

పటిష్ట బందోబస్తు

నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆర్‌ఓ కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు హద్దులు నిర్ణయించి పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసు అధికారులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సంక్షేమ పథకాలే బలం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దీవెనలతో, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఆశీర్వాదంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నాకు గొప్ప బలం. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు. నాకు ఓటు వేయాలని పట్టభద్ర ఓటర్లను వినమ్రంగా కోరుకుంటున్నా.

– వెన్నపూస రవీంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

సమస్యల పరిష్కారానికి కృషి

సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, అధికార పార్టీతో పాటు 36 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్లు నాకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తా.

-రామచందారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

క్లుప్తంగా

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీ కృష్ణ తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన లింగాల భాస్కరరెడ్డి కుమార్తె స్నేహ రెడ్డికి రొంపిచెర్ల మండలం గిర్లపల్లి గ్రామానికి చెందిన గుండ్లూరి మోహన్‌రెడ్డితో వివాహం అయింది. అదనపు కట్నం కోసం తరచూ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ భర్త మోహన్‌రెడ్డి, మామ రామచంద్రారెడ్డి, అత్త మల్లీశ్వరి ఇంటి నుంచి గెంటివేశారని స్నేహరెడ్డి గురువారం టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాధితురాలి భర్త, అత్త, మామపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కలికిరి : కుమారుడు కనిపించలేదనే మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలికిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలికిరి రెడ్డివారిపల్లి గ్రామం తుమ్మలపేట వడ్డిపల్లికి చెందిన వి.నాగమల్లయ్య ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. తెలిసిన వారు, బంధువులను విచారణ చేసినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. కుమారుడు కనపడలేదని మనస్తాపానికి గురైన నాగమల్లయ్య తండ్రి వి.క్రిష్టయ్య(55) గురువారం మధ్యాహ్నం పురుగుల నివారణ మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతి రుయా తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చౌక బియ్యం పట్టివేత

మదనపల్లె : కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. తాలూకా ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం వేంపల్లె క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. లగేజీతోపాటు ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. మదనపల్లె పట్టణంలో రేషన్ బియ్యంను లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి కర్ణాటకకు అక్రమంగా ఎనిమిది 50 కిలోల బస్తాలు తరలిస్తున్నట్లు తెలిపాడు. దీంతో కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు తాలూకా ముదిముదుగు గ్రామానికి చెందిన నిందితుడు రామకృష్ణ(38)పై కేసు నమోదు చేసి ఆటో సహా 400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు చేనేత కార్మికులపై చీటింగ్ కేసు

మదనపల్లె : ఇద్దరు చేనేత కార్మికులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. పుంగనూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తూ మదనపల్లెలోని పోతులప్పవీధిలో నివాసం ఉంటున్న నాగరాజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన చేనేత కార్మికులు వీరభద్ర, రాజేశ్వరి మగ్గాలు నేస్తూ జీవనం సాగిస్తున్నారు. పుంగనూరు రెవెన్యూ కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేస్తున్న నాగరాజ బ్యాంకు ఖాతా ష్యూరిటీ సంతకాలను ఫోర్జరీ చేసి సీటీఎం రోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో రూ.లక్ష ముద్రా రుణాన్ని నిందితులు తీసుకున్నారు. రుణం సక్రమంగా చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు జామీను సంతకం చేసిన నాగరాజును రుణం చెల్లించాల్సిందిగా నోటీసులు ఇచ్చి ఒత్తిడి చేశారు. దీంతో ఆయన నిందితులపై చీటింగ్ కేసు పెట్టారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట





ధ్వజ స్తంభ ప్రతిష్టలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూర్వపు మఠాధిపతుల కుమారుడు శ్రీవెంకటాద్రిస్వామి

- శాస్త్రోక్తంగా నిర్వహణ
- భారీగా పాల్గొన్న భక్తజనం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో నూతన జీవధార ధ్వజస్తంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. దాతల చేత ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని మఠం నిర్వాహకుల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. మఠం వేద పండితులతో మూడు రోజుల పాటు ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరబోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీవెంకటాద్రిస్వామి, శ్రీ వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజుల స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. కలసపాడు మండలం ఎగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన గంగసాని వంశస్తులు ధ్వజస్తంభాన్ని తెప్పించారు. గతంలో కూడా రెండు సార్లు వారే ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని వీక్షించి, తన్మయులయ్యారు. కార్యక్రమంలో శ్రీఈశ్వరీదేవి మఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి, తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి, ప్రొద్దుటూరు చెందిన కృష్ణమాచారి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ఎండోమెంట్ ఏసీ, బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, కందిమల్లాయపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. మైదుకూరు డీఎస్పీ, రూరల్ సీఐ, ఖాజీపేట ఎస్‌ఐ, బి.మఠం ఏ ఎస్‌ఐ, పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవాలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. శుక్రవారం నుంచి మంగళవారం వరకు (ఐదు రోజుల పాటు) నిర్వహించనున్నారు.

- శుక్రవారం తెల్లవారుజామున శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సుప్రభాతం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం మఠాధిపతుల మూలపురుషులు శ్రీ పెద్ద గోవింద స్వాముల ప్రథమ పుత్రుడు శ్రీ గోవింద స్వామి ధర్మపత్ని వీరపాపమాంబ వారి ఆరాధన– ద్వారపూజ చేస్తారు.
- శనివారం రాత్రి 8 గంటల నుంచి స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం నరనంది ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం (జాగరణ) చేస్తారు.
- ఆదివారం మోహినీ అలంకారోత్సవం, నంది ఉత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి.
- సోమవారం మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం, పుష్పరథోత్సవం నిర్వహిస్తారు.
- మంగళవారం కొట్నోత్సవం, వసంతోత్సవం నిర్వహించి, పూర్ణాహుతి సమర్పిస్తారు.
- ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి కోరారు.

ఈశ్వరీదేవి మఠంలో..

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం కలశస్థాపన, అభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తారు. శనివారం ఉదయం శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణమూర్తుల తులాభారం కార్యక్రమం కమనీయంగా జరుగుతుంది. రాత్రి 7 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున రుద్రాభిషేకం (జాగరణ) ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేస్తారు. ఆదివారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణమూర్తుల గ్రామోత్సవం, శ్రీ ఈశ్వరీదేవి సింహవాహన గ్రామోత్సవం జరుగుతాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సోమవారం మహాప్రసాద వినియోగం ఉంటుంది. నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలను మఠాధిపతులు శ్రీ వీరశివకుమార స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పొలతల ముస్తాబు

నేటి నుంచి ఉత్సవాలు

పెండ్లిమర్రి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ప్రముఖమైనది పొలతల. ఇక్కడ మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయకుడు, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారు కొలువైనారు. కాశినాయన ఆశ్రమం ఉంది. మహాశివరాత్రి ఉత్సవాలకు పొలతల ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అశోక్ రెడ్డి, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టనున్నారు.

ముత్యాల తలంబ్రాలతో కల్యాణం

పొలతల శైవ క్షేత్రంలో శుక్రవారం ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజ, అభిషేకాలంకరణ వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. శనివారం చండీ హోమం, పూర్ణాహుతి, రథ ప్రతిష్ట, కుంకుమార్చన అనంతరం ఉదయం 10 గంటల నుంచి ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం ముంగింపు ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయి.



ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

'మారెడ్డి ఆనందరెడ్డి' సేవలు మరువలేనివి



మారెడ్డి ఆనందరెడ్డి, ప్రమీలరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కడప కల్చరల్ : నగర ప్రముఖులు, సంఘ సేవకులు మారెడ్డి ఆనందరెడ్డి సేవలను మరువలేమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఈగల్ డిస్టిలరీస్ యజమాని లయన్ మారెడ్డి ఆనందరెడ్డి తొలి వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నగర శివార్లలోని ఆయన కర్మాగారం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరెడ్డితోపాటు ఆయన సతీమణి ప్రమీలరెడ్డితో కలిపి ఘాట్‌ను నిర్మించారు. క్రైస్తవ గురువులు ఫాదర్ జోజిరెడ్డి, ఫాదర్ లారెన్స్ దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆనందరెడ్డి దంపతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు ఘాట్‌ను దర్శించుకుని ఆనందరెడ్డి దంపతుల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతహాగా దానశీలి అయిన ఆనందరెడ్డి కర్మాగారం నుంచి వందలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా పేదలు, అనాథలకు ఎంతో సాయం చేశారని, నగర వాసుల దాహం తీర్చేందుకు ట్యాంకర్లు, బోర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మరువలేమన్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు సతీష్‌రెడ్డి, కోడలు వీణారెడ్డి, కుమార్తెలు విజయ, సౌభాగ్యరాణి, సురేష్‌రెడ్డి, అనిత విష్ణురెడ్డి, లీల డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఆనందరెడ్డి, ప్రమీలరెడ్డిల చిత్రపటాలను ఆవిష్కరించారు. ఘాట్‌పై పూలమాలలు సమర్పించి ప్రార్థనలు జరిపారు. ఫిలడెల్ఫియా నుంచి విచ్చేసిన ఆనందరెడ్డి సోదరి వంగల మేరిరెడ్డి, డాక్టర్ వెంకట్రామిరెడ్డిలు కూడా ఘాట్‌ను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. మారెడ్డి అసంతమ్మ, మేరి, జోసఫినమ్మ, వైఎస్ నిర్మల, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నిర్మలమ్మ, లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి, విజయ, ప్రముఖ వైద్యులు కరుణాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, హరికిషోర్‌రెడ్డి, వంశి తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆనందరెడ్డి దంపతుల బంధుమిత్రులు, ఆత్మీయులు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా,మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి బుధవారం ఆనందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించారు. రాయచోటి మనం ఎస్‌ఎస్‌సీ 1983 బ్యాచ్ వారు బెంగళూరుకు చెందిన అపోటెక్స్ సహకారంతో యునైటెడ్ వే ఆధ్వర్యంలో రూ. 91 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. ఇందులో భాగంగా 14 తరగతి గదులు, రెండు సైన్స్ ల్యాబ్‌లు, ఆర్‌ఓ యూనిట్‌తోపాటు గది, మరుగుదొడ్లు నిర్మించారు. కళాశాలకు పెయింటింగ్, తరగతి గదులపై మోరల్ ఆర్ట్, డెస్కుల రిపేరు, పెయింటింగ్, ఫర్నీచర్, సైన్స్ పరికరాలు, బాలికలకు హైజీన్ కిట్, ఆటో మేటిక్ స్కూల్ బెల్, 55 ఇంచ్‌ల ఎల్‌ఈడీ టీవీ పరికరాలు సమకూర్చారు. వీటిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుకున్న కళాశాలకు మనం 1983 బ్యాచ్ విద్యార్థులు లక్షలాది రూపాయలతో మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమని, ఆదర్శనీయమని తెలిపారు. మనం సేవా సంస్థ చేపడుతున్న సేవ, అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. అనంతరం కళాశాల అభివృద్ధికి కృషి చేసిన మనం సంస్థ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మనం సేవాసంస్థ అధ్యక్షుడు ప్రకాష్ బాబు, కార్యదర్శి జోషి, అపోటెక్స్ డైరెక్టర్ యోగాంజనేయరెడ్డి, మాస్టర్స్ ఇన్ క్లినికల్ రీసెర్చ్ హాంకాంగ్ యూనివర్సిటీ డాక్టర్ గౌతమ్ పూజారి, అపోటెక్స్ కార్యదర్శి ఇంద్రజ్యోతి బోస్, యునైటెడ్ వే సీఈఓ రాజేష్ కృష్ణన్, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, బేపారి మహ్మద్ ఖాన్, ఫయాజ్ అహ్మద్, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమ శిక్షణా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరాజు, వీఆర్ విద్యా సంస్థల అధినేత వీఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



చిప్పిలి వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న సీపీఐ ప్రతినిధి బృందం

- కడప -బెంగళూరు రైల్వేలైను మదనపల్లె మీదుగా నిర్మించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు

మదనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఈ నెల 13న తుంగభద్ర నుంచి ప్రారంభమైన యాత్ర గురువారానికి మదనపల్లెకు చేరింది. ఇందులో భాగంగా సీపీఐ ప్రతినిధి బృందం పట్టణానికి సమీపంలోని చిప్పిలి వద్ద హంద్రీనీవా కాలువ, సమ్మర్‌స్టోరేజిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మదనపల్లె పట్టణ ప్రజలకు హంద్రీనీవా కాలువ ద్వారా తాగునీరు అందిస్తామని గత ప్రభుత్వాలు వాగ్దానం చేసినా, ఇప్పటి వరకు పూర్తయిన పరిస్థితి లేదన్నారు. హంద్రీనీవా పూర్తయితే రాయలసీమలో వలసలు ఆగుతాయని, తాగు, సాగునీరు అందరికీ అందుతుందన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చిప్పిలి సమ్మర్ స్టోరేజి నిర్మించారని, దీనికి రూ.15 కోట్లు ఖర్చు పెడితే మొరవ, పైప్‌లైన్ పనులు పూర్తయి 2 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్ల కేటాయింపుతో హంద్రీనీవాకు సమాంతర కాలువ నిర్మిస్తే రాయలసీమ ప్రజల దాహార్తి తీరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో వివిధ రాజకీయ పార్టీలను కలుపుకొని మదనపల్లె వేదికగా పోరాటానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టరేట్ వద్దకు చేరుకున్న సీపీఐ ప్రతినిధి బృందం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కడప నుంచి మదనపల్లె మీదుగా బెంగళూరుకు రైల్వే లైను నిర్మించాలని ధర్నా చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడప నుంచి మదనపల్లె మీదుగా బెంగళూరుకు 250 కిలోమీటర్ల పొడవు రైల్వే లైన్ నిర్మాణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. రైల్వేలైన్ మదనపల్లె మీదుగా నిర్మిస్తే స్థానిక ప్రాంత ప్రజల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఈశ్వరయ్య, ఆవులశేఖర్, రాష్ట్ర సమితి సభ్యులు జనార్ధన్, కృష్ణప్ప, జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, మహేష్, సాంబ, టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, మధుబాబు, భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి



చిన్నారి జాహ్నవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ ఎస్టీ కాలనీ వద్ద గురువారం స్కూల్ వ్యాన్ ఢీకొని ఓ చిన్నారి మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మొయిళ్లకాల్వకు చెందిన వడ్డెమాని మధుసూదన్‌రెడ్డి, పార్వతి దంపతులకు సాయి, జాహ్నవి (2) అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సాయి వెల్లటూరులోని సత్యసాయి హైస్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. సాయిని తండ్రి మధుసూదన్‌రెడ్డి స్కూల్ వ్యాన్ వద్దకు తీసుకువచ్చి ఎక్కించాడు. తండ్రి వెనుక వైపు చిన్నారి జాహ్నవి వచ్చింది. అది గమనించలేదు. ఎవరూ లేరని స్కూల్ వ్యాన్‌ను డ్రైవర్ ముందుకు పోనించాడు. చిన్నారి జాహ్నవి వ్యాన్ ముందు టైరు కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమా?

ప్రయివేట్ స్కూల్ నడుపుతున్న యాజమాన్యం విద్యార్థులను ఇళ్ల వద్ద నుంచి స్కూల్‌కు వ్యాన్‌లో ఎక్కించుకోడానికి వెళ్లినప్పుడు డ్రైవర్లు మాత్రమే ఉన్నారు. స్కూల్ వ్యాన్‌లకు క్లీనర్లు గానీ, స్కూల్ సిబ్బంది గానీ ఉండడం లేదు. దీని కారణంగా చిన్నారి జాహ్నవి నిండు ప్రాణాన్ని స్కూల్ వ్యాన్ బలి తీసుకుంది. స్కూల్ వ్యాన్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే పాడిపశువుల వృద్ధి



బహుమతులు పొందిన లేగ దూడలతో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, అధికారులు

రైల్వేకోడూరు రూరల్ : రైతులు జాగ్రత్తలు పాటిస్తే పాడి పశువులు వృద్ధి చెందుతాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిగుంట పంచాయతీలో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని రైతులు అభివృద్ధి చెందడానికి ఎన్నో విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. అనంతరం పశు వైద్యాధికారులు కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన ఏడు నెలల్లోపు వయసు ఉన్న 51 లేగ దూడలకు జాతి, పోషణ పరంగా పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్న లేగదూడలను గుర్తించి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి గంగురాజు పోడుకు చెందిన రామయ్య, రెండవ బహుమతి శెట్టిగుంటకు చెందిన వెంకట్రామయ్య, మూడవ బహుమతి శెట్టిగుంటకు చెందిన సుబ్బరాయుడుకు అందించారు. అలాగే లేగ దూడలను తీసుకొచ్చిన రైతులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ గుణ శేఖర్ పిళ్ళై, సెమెన్ బ్యాంకు డీడీ డాక్టర్ రమేష్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ రాజంపేట డాక్టర్ అబ్దుల్ ఆరిఫ్, రైల్వేకోడూరు ఏడీ డాక్టర్లు సురేష్ రాజు, డాక్టర్లు రవీంద్ర వర్మ, శివరామిరెడ్డి, శరత్, ప్రతాప్, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.